www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 19 సెప్టెంబర్ 2025


5

చిత్తూరు



కాణిపాకం దేవస్థానం ఛైర్మన్ ముని నాయుడు

ప్రజాశక్తి- ఐరాల: రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాలకు ఛైర్మన్లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో శ్రీకాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి వారి ఆలయ పాలకమండలి ఛైర్మన్‌గా మని నాయుడు (సురేంద్ర నాయుడు)ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



సిఎం చంద్రబాబుతో కాణిపాక ఛైర్మన్ నాయుడు

జిల్లాలో సరిపడా యూరియా నిల్వలున్నాయి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఆర్‌ఎస్‌కెల ద్వారా యూరియా పంపిణీ చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో యూరియా పంపిణీలో భాగంగా గురువారం చిత్తూరు, పూతలపట్టు, జిడి నెల్లూరు, కుప్పం, పలమనేరు, పుంగనూరు, నగరి నియోజకవర్గ పరిధిలోని 125 క్లస్టర్‌లలో 3293 మెట్రిక్ టన్నులు నిల్వ ఉందని తెలిపారు. ఆర్‌ఎస్‌కెలు, ప్రైవేట్ షాప్స్, సొసైటిలలో యూరియా పంపిణీని పకడ్బందీగా నిర్వహించాలని ఎలాంటి పొరబాట్లు జరగకుండా ప్రత్యేకచర్యలు చేపట్టాలని వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. రైతులకు ఆర్‌ఎస్‌కెల ద్వారా యూరియా పంపిణీ చేస్తున్నామని, యూరియా నిల్వలు ఉన్నాయని, ఈ నిల్వలు రైతుల అవసరాలకు సరిపోతాయన్నారు. అవసరం అయితే ఇంకా యూరియా జిల్లాకు తెప్పించడం జరుగుతుందన్నారు. గత సంవత్సరం 45వేల హెక్టార్లలో పంటలు పండించగా 15 వేల మెట్రిక్ టన్నులు యూరియా పంపిణీ చేశామని, యూరియా పంపిణీ రైతులు పండిస్తున్న పంటను బట్టి ఇస్తున్నామని, అవసరమైన మేర మాత్రమే యూరియా వాడాలని కలెక్టర్ తెలిపారు.

మహిళా పాడి రైతులను ప్రోత్సహించాలి

- పౌల్ట్రీ రంగంపై విస్తృతంగా అవగాహన
- కిచెన్ గార్డెన్స్‌పై శిక్షణా కార్యక్రమాలు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల మహిళల జీవనోపాధుల వృద్ధికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. గురువారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళల జీవనోపాధుల అభివృద్ధి వార్షిక రుణప్రణాళికపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎస్‌హెచ్‌జి మహిళల ఆర్థికాభివృద్ధిలో భాగంగా వ్యవసాయ, అనుబంధ ఇతర రంగాలకు సంబంధించి ప్రణాళికలు రూపొందించాలన్నారు. మహిళలకు తమ ఇంటి వద్ద ఉన్న అవకాశాన్ని బట్టి కిచెన్ గార్డెన్ ఏర్పాటుకు అవసరమైన అవగాహన కల్పించి విత్తనాలు సరఫరా చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీస్త్రీలకు పోషకాహారంపై అవగాహన పెంచాలన్నారు. సిడిపిఓలు క్షేత్రస్థాయిలో ప్రతి అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసే నివేదికలు అందజేయాలని ఐసిడిఎస్ పీడీని ఆదేశించారు. బరువు తక్కువ ఉన్న పిల్లలను గుర్తించి వారికి మంచి పౌష్టిక ఆహారం అందజేయాలని ఆదేశించారు. పాడి పరిశ్రమ, పౌల్ట్రీ రంగంలో మహిళలు రాణించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ ఆధారిత జీవనోపాదుల ఏ పథకాలు అమలు చేయుచున్నారు వాటిని గ్రామీణ ప్రజలకు, లబ్ధిదారుల ఎంపిక ఎలా జరుగుతున్నదని, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని డిఆర్‌డిఏ అధికారులను ఆదేశించారు. నగరి, విజయపురం, కార్వేటినగరం, ఎస్ఆర్.పురం మండలాలలో, మహిళా రైతులకు ఉద్యానవన పంటలపై ఆసక్తి కలిగే విధంగా, ఉద్యానవన శాఖ అధికారులు, డిఆర్‌డిఏ అధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు. టిష్యూ కల్చర్ ద్వారా అరటి పంట, బొప్పాయి పంటలపై మండలాలలో మహిళ రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో మహిళ పాడి రైతులను గుర్తించి, వారికి అవగాహన కల్పించి వారి ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. సొంత భూమి కలిగి ఉన్న మహిళ రైతులు స్వయం సహాయక సంఘంలో సభ్యులై ఉండాలి, పశుగ్రాస క్షేత్రాలను ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టాలి. గ్రామస్థాయిలో పశు సంపద కలిగిన ప్రతి మహిళా పాడి రైతు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని అందుకు పశు సంవర్ధక శాఖ కృషి చేయాలని తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టం మహిళలు పాల్గొనే విధంగా సంబంధిత శాఖ అధికారులు కృషి చేయాలని తెలిపారు. వ్యవసాయ రంగంలో మహిళలకు డ్రోన్ వినియోగంపై చిరుధాన్యాలపై, ప్రకృతి వ్యవసాయంపై మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

పరిశ్రమల ఏర్పాటుకు స్థలపరిశీలన

మండలంలో పర్యటించిన కలెక్టర్

ప్రజాశక్తి- ఎస్ఆర్‌పురం: మండలంలో పరిశ్రమల ఏర్పాటుకు గురువారం స్థలపరిశీలన చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో జిల్లాలో పరిశ్రమల సెక్టార్లలో పారిశ్రామిక పార్కులు రాబోతున్నాయని, అందులో భాగంగా జీడి నెల్లూరు నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు స్థానిక ఎంఎల్‌ఏ అభ్యర్థన మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఏపిఐఐసి ద్వారా స్థల పరిశీలన చేయాలని సూచనలు జారీ చేయడం జరిగిందన్నారు. ఎస్ఆర్.పురం మండలం పాతపాలెం, 56-కన్నికాపురం, జిఎంఆర్ పురం రెవెన్యూ గ్రామాలలో 1,000 ఎకరాల ప్రభుత్వ, డికెటి, ప్రైవేట్ భూ సేకరణకు స్థల పరిశీలన చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా రైతులతో చర్చించడం జరిగిందని, ఈ విషయమై మరిన్నిసార్లు పరిశీలన చేయవలసి ఉందన్నారు. ఈ పర్యటనలో ఏపిఐఐసిజెడ్ ఎం.సుబ్బారావు, తహశీల్దార్ లోకనాథ పిళ్ళై, అధికారులు పాల్గొన్నారు.



- పరిశ్రమలకు స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

పారామెడికల్ ట్రైనింగ్

కోర్సుల ప్రవేశాల గడువు పెంపు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పారా మెడికల్ ట్రైనింగ్ కోర్సుల ప్రవేశాల గడువు అక్టోబర్ 4వ తేదీ వరకు పెంచుతున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ సుధారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పారామెడికల్ ట్రైనింగ్ కోర్సులో ఉచిత ప్రవేశ నిమిత్తమై 2025-26 సంవత్సరంకు ఇంటర్మీడియట్ 40 శాతం మార్కులతో పాసైన మగ, ఆడ అభ్యర్థుల నుంచి దరఖాస్తుల కోరడమైనది. ఆసక్తి కల అభ్యర్థులు వెబ్సైట్‌లో దరఖాస్తులను డౌన్లోడ్ చేసుకొని, పూరించి, సర్టిఫికెట్లను జత చేసి రూ.100లు క్యాష్‌గా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి 4-10-2025 సాయంత్రం ఐదు గంటల లోపల సమర్పించాలని కోరడమైనది. ఇతర వివరాలకు పై వెబ్సైట్‌ను దర్శించాలన్నారు.

క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులు

సూరయ్యగారిపల్లి విద్యార్థులకు 27 పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయ బృందం

ప్రజాశక్తి- సోమల: ఈనెల 16వ తేదీ మండల కేంద్రమైన సోమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన మండల స్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆటల పోటీలలో సూరయ్య గారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పలు ఆటల పోటీలలో పాల్గొని ప్రతిభ చూపి 27 పతకాలు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గిరీష, పిడి శివకుమార్ తెలిపారు. 100 మరియు 200 మీటర్ల పరుగు పందెం షార్ట్ పుట్ పోటీలలో మధుప్రియ ప్రథమ ద్వితీయ స్థానాన్ని, షర్మిల 100 మీటర్ల పరుగు పందెంలో రెండవ స్థానాన్ని, రిలే పోటీలలో రెండవ స్థానాన్ని డిస్క్ త్రో మూడవ స్థానాన్ని, ఆయేషా 25 మీటర్లు రిలే పోటీలో షాట్ పుట్ పోటీలో రెండవ స్థానాన్ని, బాలుర విభాగంలో 100 200 మీటర్ల పరుగు పందెంలో సలావుద్దీన్ ప్రథమ స్థానాన్ని, 600 మరియు 400 మీటర్ల పరుగు పందెంలో మహీధర్ మొదటి స్థానాన్ని, షార్ట్ పుట్ పోటీలలో తాపిక్ మూడవ స్థానాన్ని, షార్ప్పుట్లో అప్సాన్ రెండవ స్థానాన్ని, డిస్క్ త్రో మరియు4ఐ100 రిలే పోటీలలో యువతేజ ప్రథమ స్థానాన్ని, షాట్ పుట్ లో విష్ణువర్ధన్ మూడవ స్థానాన్ని, 4ఐ100 రిలే పోటీలో సాజిద్ రెండవ స్థానాన్ని కైవసం చేసుకున్నారని, మొత్తం 27మంది పతకాలు సాధించినట్లు వారు తెలిపారు. అనంతరం పోటీలలో పాల్గొని పతకాలు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం గురువారం అభినందించారు.

సమస్యలు పరిష్కరించండి

ఎస్ఈ కార్యాలయం ఎదుట విద్యుత్ ఉద్యోగుల ధర్నా




విద్యుత్‌శాఖ ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల కార్మికుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. జేఏసీ ఛైర్మన్ మురళీకృష్ణ మాట్లాడుతూ మూడు దశాబ్దాలకు పైగా పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్‌ని రెగ్యులర్, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. జెఎల్ఎం జిఆర్2 సచివాలయ ఉద్యోగులను రెగ్యులర్ జెఎల్ఎంలుగా పరిగణించి వేతనాలు తదితర ప్రయోజనాలన్నీ కనిపించాలని, క్షేత్రస్థాయిలో ఖాళీగా ఉన్న అన్ని స్థాయి పోస్టులను భర్తీ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వంలో అమలులో ఉన్న 2004 వరకు ఉన్న విద్యుత్ ఉద్యోగులకు కూడా అమలు చేయాలన్నారు. విద్యుత్ ఉద్యోగులకు పెన్షనర్లకు వారి కుటుంబ సభ్యులకు పూర్తి వైద్య ఖర్చులు చెల్లించాలని కోరారు. విద్యుత్ శాఖలో విద్యార్హత కలిగిన వారికి ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ యజ్ఞేశ్వరరావు, కో ఛైర్మన్ వివేకానంద రెడ్డి, వైస్ చైర్మన్ చంద్రశేఖర్, చంద్రమౌళి, రజ్జు సాహెబ్, బద్రేషన్, రాజేంద్ర బాబు, యుగంధర్ రెడ్డి, నరేంద్ర, ఆరోరన్ పాల్గొన్నారు.

కంగుందిలో బౌల్డరింగ్ జిమ్ ఏర్పాటు..

ప్రజాశక్తి- కుప్పం: కుప్పం మండలం కంగుందిలో బౌల్డరింగ్ జిమ్ ఏర్పాటుకు ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ మునిరత్నం, కడ పిడి వికాస్ మర్మత్ గురువారం పూజ కార్యక్రమాలు చేశారు. తదేకం టీం ఆధ్వర్యంలో బౌల్డరింగ్ జిమ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం తెలిపారు. కుప్పం నియోజకవర్గంలో మొట్టమొదటిసారిగా ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని ఇది యువతకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. క్రీడలు యువతలో శారీరక దృఢత్వం, మానసిక చైతన్యం పెంపొందించడంతో పాటు కొత్త అవకాశాలకు మార్గం చూపుతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనశేఖర్, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేష్, నాయకులు దివాకర్, మునఫ్ క్రీడాకారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

భూ సేకరణ ఆడిట్‌పై డిఆర్‌ఓ ఆరా



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇళ్ల పట్టాల మంజూరుకు సేకరించిన భూ వివరాలకు సంబంధించి ఆడిట్ పేరాలకు సమాధానాలు వెంటనే పంపాలని తహశీల్దార్‌లను డిఆర్‌ఓ ఆదేశించారు. గురువారం ఇళ్ల పట్టా పంపిణీ భూసేకరణపై చిత్తూరు, పలమనేరు, కుప్పం, నగరి ఆర్‌డిఓలు, తహశీల్దార్లతో డిఆర్‌ఓ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఓ మాట్లాడుతూ పుంగనూరులో సర్వే నెం 335/2 లో ఇళ్ల పట్టాల కొరకు సేకరించిన భూమిని ప్రైవేట్ సంస్థలకు అప్పగించారన్న అంశానికి సంబంధించి వివరణ ఇవ్వాలన్నారు. అలాగే పుంగనూరులో ఇళ్ల పట్టాల కొరకు 363 మందికి ఒక సెంట్ భూమికి బదులు 1.5 సెంట్ భూపంపిణీ చేశారన్నారు. 452 మంది కొరకు 8.22 ఎకరాల భూమి సేకరించగా కేవలం 246 మందికి మాత్రమే పంపిణీ చేశారని అందుకుగల కారణాలను వివరించాలన్నారు. చిత్తూరు పట్టణ పరిధిలో అనుపల్లి, బండపల్లి, దొడ్డిపల్లి ప్రాంతాలలో భూ సేకరణ ఎక్కువ చేశారని, నిర్దేశించిన లక్ష్యం కంటే తక్కువ మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారన్నారు. పూతలపట్టు మండలంలో సర్వే నెం. 439లో ఒడ్డుపల్లి, పోలవరంలో భూసేకరణ వివరాలను సమర్పించాలన్నారు. జిల్లాలో ప్రతి మండలంలో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో 1.5 సెంట్ల భూమి పంపిణీ చేయాల్సి ఉండగా కొంత మంది లబ్ధిదారులకు ఒక సెంట్, 1.25 సెంట్లు, 1.35 సెంట్లు ఇళ్ల పట్టాల పంపిణీ చేశారని ఇందుకు గల కారణాలను తహశీల్దార్ వద్ద నుండి ఆర్‌డిఓలు సేకరించి నివేదిక రూపంలో పంపాలన్నారు. ఆడిట్ పేరాలకు సంబందించి సమాధానాలను వీలైనంత త్వరగా సిద్ధం చేసి పంపాలని ఆర్‌డిఓలను ఆదేశించారు.

జిల్లా పర్యాటక అధికారిగా నరేంద్ర కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): జిల్లా పర్యాటకశాఖ అధికారిగా నరేంద్ర కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. చిత్తూరు జిల్లా పర్యాటకంగా అభివృద్ధి చెందుతే యువతకు ఉపాధి అవకాశాలు ఉంటుందన్నారు. తనకున్న అవగాహనతో చిత్తూరు జిల్లాను మరింతగా పర్యాటక రంగంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న నరేంద్ర కుమార్

డిఎఫ్ఓగా సుబ్బరాజు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా అటవీశాఖ నూతన అధికారిగా సుబ్బరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా అటవీ శాఖ అధికారినిగా పనిచేస్తున్న భరణి ఉద్యోగోన్నతిపై వెళ్లడంతో ఆస్థానంలో నూతన డిఎఫ్ఓగా సుబ్బరాజు నియమించబడ్డారు. ఏ మేరకు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. బదిలీపై వెళుతున్న మాజీ డిఎఫ్ఓ భరణిది అటవీశాఖ అధికారులు సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.



డీఎఫ్ఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న సుబ్బరాజు

గెలుపొందిన విద్యార్థులకు బహుతులు



ప్రజాశక్తి- విజయపురం (నింద్ర): మండలస్థాయి క్రీడా పోటీల్లో భాగంగా గురువారం నింద్ర హైస్కూల్ మైదానంలో విద్యార్థులకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. క్రీడామైదానాన్ని, క్రీడాకారులను, మండల విద్యాశాఖ అధికారి వసుమతి పోటీలను ప్రారంభించారు. పోటీల్లో పాల్గొనడానికి విద్యార్థులు అత్యంత ఆసక్తి కనభరిచారు. వాలీబాల్ విజేత నింద్ర, సీనియర్ కబడ్డీ విజేత నింద్ర జూనియర్, కబడ్డీ విజేత కొత్త అరూరు, ఖోఖో విజేత అత్తురు స్కూల్ విద్యార్థులు గెలిచారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మండల క్రీడాకమిటీ కన్వీనర్ జ్ఞాన కుమార్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, జాన్ డల్లాస్, ఎడ్వార్డ్, కార్తీక్, ప్రభాకర్ వివిధ పాఠశాలలకు చెందిన పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

పెనుమూరు సిహెచ్‌సిని పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: వైద్యచికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. గురువారం పెనుమూరులోని సిహెచ్‌సిని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా ఆసుపత్రి సిబ్బంది హాజరును పరిశీలించారు. ఆసుపత్రి సిబ్బంది సమయపాలన తప్పక పాటించాలన్నారు. ఆసుపత్రి లో ఎక్స్ రే రూమ్, స్టోర్ రూమ్‌ను, ఓపి శాతం పెంచాలన్నారు. వైద్య చికిత్స కొరకు అవసరమైన మందులను స్టాక్ ఉంచుకోవాలన్నారు. సిహెచ్‌సి ప్రాంగణంలో నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు.

ఘనవ్యర్థాల నిర్వహణపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఘన వ్యర్థాల నిర్వహణపై వార్డు కార్యదర్శులు అవగాహన పెంచుకోవాలని సహాయ కమిషనర్ అవినేని ప్రసాద్ చెప్పారు. గురువారం నగరపాలక కార్యాలయంలో ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ (ఏఐఐఎల్ఎస్జీ) సంస్థ ఆధ్వర్యంలో వార్డు పర్యావరణ, పారిశుద్ధ్య కార్యదర్శులు, వార్డు అమినిటీ కార్యదర్శులకు సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్‌పై ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. సహాయ కమిషనర్ మాట్లాడుతూ.. నగరపాలక పరిధిలో ఘన, ప్లాస్టిక్, నిర్మాణరంగ వ్యర్థాలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఈ అంశాలపై కార్యదర్శులు సమగ్ర అవగాహన పెంచుకోవాలన్నారు. ఏఐఐఎల్ఎస్జీ సంస్థ శిక్షకులు డాక్టర్ కె.శ్రీనివాసులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సాలిడ్ వెస్ట్ మేనేజ్మెంట్ విధానాలపై కార్యదర్శులకు అవగాహన కల్పించారు. శానిటరీ ఇన్స్పెక్టర్లు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆటోనగర్ ఏర్పాటుకు వినతి



ప్రజాశక్తి- కుప్పం: కుప్పంలో ఆటోనగర్ ఏర్పాటుకు కార్మికులు గురువారం వినతిపత్రం అందజేశారు. గతంలో టిడిపి హయంలో కుప్పంలో ఆటోనగర్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించడంతోపాటు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే వైసిపి అధికారంలోకి రావడంతో ఆటోనగర్ ఏర్పాటు ఆగిపోయింది. ఈ నేపథ్యంలో కుప్పంలో కార్మికుల కోసం ఆటోనగర్‌ను ఏర్పాటు చేయాలని కార్మిక సంఘాల నేతలు గురువారం కడ అడ్వైజర్ కమిటీ సభ్యుడు రాజ్ కుమార్, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రేమ్ కుమార్, కుప్పం మున్సిపల్ టిడిపి అధ్యక్షులు కాణిపాకం వెంకటేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ సత్యేంద్ర శేఖర్‌లకు వినతిపత్రం అందజేశారు. కార్మిక నాయకులు శివకుమార్, మునాఫ్, శివ, జగన్, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం మీ వెంటే..

- నెలరోజుల పాటు మాసోత్సవాలు

ప్రజాశక్తి- పుంగనూరు

పౌష్టికమైన ఆహారం తీసుకుంటూ ఆరోగ్యంగా ఉంటారని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవగాహన కల్పించడానికి అంగన్వాడీలకు ప్రతి ఏడాది మాసోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. ఆహార అలవాట్లు కారణంగా గర్భిణీలు, బాలింతలు రోగాల భారినపడుతున్నారు. దీనికితోడు అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులకు సైతం వ్యాధులు వెంటాడుతున్నాయి. ఐసిడిఎస్ అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. దీంతో రక్తహీనత తదితర ఆరోగ్య సమస్యలు పిల్లలను తలెత్తుతున్నాయి. ఈ సమస్యలను అధిగమించడానికి ప్రభుత్వం ప్రతి ఏడాది మాసోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా పోషకాహార మాసోత్సవాలు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 16 వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. మాసోత్సవాలలో బలాన్ని పెంచి ఆహార పదార్థాలు తయారీపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికారులు కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. పోషకాహార లోపంతో మాత శిశు మరణాలు పెరిగాయని గుర్తించిన ప్రభుత్వం ప్రత్యేకంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహిస్తుంది.

పుంగనూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడీ ప్రధాన కేంద్రాలు గతంలో 177 ఉండగా 43 అంగన్వాడీ కేంద్రాలు అప్గ్రేడ్ కావడం జరిగింది. ప్రాజెక్ట్ ఆఫీసర్ రాజేశ్వరి గురువారం తెలిపారు. 12 మినీ అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయన్నారు. గర్భిణీలు 996, బాలింతలు 869, ఏడు నెలల నుండి మూడేళ్ళ లోపు పిల్లలు 5063మంది, 3 నుండి 6 ఏళ్ల లోపు పిల్లలు 3698 ఉన్నట్లు తెలియజేశారు. ఈ మాస ఉత్సవాల సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల పరిధిలో ర్యాలీలు నిర్వహించి అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తారు. ఈ సదస్సులో పోషకాహార ప్రాముఖ్యతను తెలియజేస్తూ పోషకాహారాన్ని తయారు చేసి అవగాహన సదస్సులు జరిగే ప్రాంతాలలో వీటిని ప్రదర్శిస్తారు. బలాన్ని ఇచ్చే వంటకాలు తయారీ తక్కువ ధరలతో లభించే పండ్లపై అవగాహన అంగన్వాడీలు కల్పిస్తారు. వీటితోపాటు అంగన్వాడీ కార్యకర్తలు ఇండ్ల వద్దకు వెళ్లి జామ, అరటి, బొప్పాయి పండ్లతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తారు.

చిరుధాన్యాలపై అవగాహన

గ్రామంలో ఏర్పాటు చేశా అవగాహన సదస్సులో రాగులు, జొన్నలు, అరికలు సజ్జలు తదితర చిరుధాన్యాలతో ఆహారం తయారుచేసి పిల్లలకు తినిపించే విధానంపై వివరిస్తారు. అలాగే జంక్ ఫుడ్‌తో కలిగే నష్టాలు కూడా తెలియజెస్తారు. ఆహార అలవాట్లతోనే ఉబకాయం, మధుమోహం తదితర వ్యాధులు ప్రభలుతాయని అవగాహన కూడా కల్పిస్తారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం : సిడిపిఓ

ప్రతి ఒక్కరూ సకాలంలో పోషకాహారం తీసుకుని ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని పుంగనూరు ఐసిడిఎస్ సిడిపిఓ రాజేశ్వరి తెలిపారు. ప్రతి అంగన్వాడీ కేంద్ర పరిధిలో పోషకాహారాలపై అవగాహన సదస్సులు ర్యాలీలు నిర్వహించి అవగాహన కల్పించిందికే మాసోత్సవాలను ప్రభుత్వం ప్రారంభించింది. ఈనెల 17 నుండి అక్టోబర్ 16 వరకు నెల రోజులపాటు మాసోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈసందర్భంగా ర్యాలీలు నిర్వహించి అవగాహన కల్పించడంతోపాటు పిల్లలు ఏయే వయసులోఎంత ఆహారం తీసుకోనే విషయాలను తెలియజేస్తామన్నారు.



బంగారుపాళ్యం: సమతుల్యత ఆహారం సంపూర్ణ ఆరోగ్యమని సిడిపిఓ వినత శ్రీ అన్నారు. గురువారం మండలంలోని తుంబకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రమేష్ ఆధ్వర్యంలో పోషణ మా కార్యక్రమం జరిగినది. ఈ సందర్భంగా సిడిపిఓ వినతశ్రీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పౌష్టికాహారాన్ని తీసుకొని ఆరోగ్యవంతులుగా ఉండాలన్నారు. అనంతరం పలువురు గర్భవతులకు సీమంత కార్యక్రమం, పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం జరిగింది. సిహెచ్ఓ నాగమణి, ఏఎన్ఎం నీరజ, అంగన్వాడీ సూపర్వైజర్ షామీదా బేగం, జిఎంఎస్‌కె స్రవంతి అంగన్వాడీలు విమల మమత పాల్గొన్నారు.



శతాధిక వృద్ధురాలు మృతి


గంగులమ్మ (ఫైల్ ఫోటో)


ప్రజాశక్తి-సోమల: సోమల పంచాయతీ గన్నా వారి పల్లెలో శతాధిక వృద్ధురాలు మారసాని గంగులమ్మ(105) గురువారం మృతి చెందారు. ఈమెకు 85 సంవత్సరాల వయసు కలిగిన కుమార్తె వుంది. ఆరోగ్యంగా ఉంటూ తన పని తాను చేసుకుంటూ కుమార్తె వద్దే గత 20 సంవత్సరాలుగా గంగులమ్మ ఉంటోంది. శతాధిక వృద్ధురాలు మృతితో గన్నావారిపల్లెలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

పెరటి కోళ్లకు టీకాలు


కోళ్లకు టీకాలు ఇస్తున్న వైద్యాధికారిణి

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల పశువైద్యశాలలో వైద్యాధికారిణి చందన ప్రియ ఆధ్వర్యంలో పెరటి కోళ్లకు కొక్కెర తెగులు వ్యాధి నివారణ టీకాలు వేశామని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాధి సోకిన కోళ్ళు తల గుండ్రంగా తిప్పడం, కళ్ళవాపు రావడం, హఠాత్తుగా చనిపోతాయని పెరటి కోళ్లకు వ్యాధి నివారణ టీకాలు తప్పని సరిగా వేయించాలని తెలిపారు. గురువారం 60 కోళ్లకు టీకాలు వేశామని పేర్కొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట: ఎంపీడీవో


ఓటేరుపల్లి యానాది కాలనీని పరిశీలిస్తున్న ఎంపీడీవో పెంచల వీరేంద్ర

ప్రజాశక్తి - యాదమరి: గిరిజనులకు మౌలిక వసతులు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీడీవో పెంచల వీరేంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని ఓటేరు పల్లి యానాది కాలనీలో మండల రెవెన్యూ అధికారులు, పంచాయతీ రాజ్ అధికారులు సంయుక్తంగా పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి యానాది కాలనీలో ప్రజలను పలకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమకు శ్మశాన వాటికకు దారి కల్పించా లని, ఇల్లు లేని వారికి ఇల్లు మంజూరు చేయాలని, ఇంటి స్థలాలు ఇవ్వాలని అభ్యర్థించారు. సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని, తాగునీటి బోరుకు కొత్త మోటారు ఆమ ర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహశీల్దారు చంద్రశేఖర్, సర్పంచ్ పత్తిపాటి భగవతి, పంచాయతీ కార్యదర్శి శైలజ, విఆర్‌వోలు శ్రీనాథ రెడ్డి, రూపావతి, మల్లికార్జున పాల్గొన్నారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న మనోహర్ గౌడ్

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండల ఎంపీడీవోగా మనోహర్ గౌడ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన నెల్లూరు జిల్లా చిట్టమూరు డిప్యూ టీ ఎంపీడీవోగా పని చేస్తున్న ఆయన ఉద్యోగోన్నతిపై జిడి నెల్లూరు మండలానికి ఆయనను బదిలీ చేశారు. ఎంపీడీవో కార్యాలయ అధికారులు, రాజకీయ నాయకులు ఆయనకు స్వాగతం పలికారు.

రైతులకు అవగాహన ఉండాలి

యూరియా వాడకంలో అధికారుల సూచన

ప్రజాశక్తి -పెద్దపంజాణి: రైతులు వారు పండించిన పంటలకు యూరియాను ఎకరాకు 30 కేజీలు మాత్రమే వాడాలని జిల్లా వ్యవసాయ అధికారి జె మురళీకృష్ణ సూచించారు. గురువారం ఆయన స్థానిక గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ యూరియా తగిన మోతాదులో పంటలకు వాడుకోవాలని, అవసరానికి మించి వాడిన భూసారం దెబ్బతిని పంట దిగుబడి తగ్గుతుందని రైతులకు తెలిపారు. యూరియా రైతులకు అవసరమైన మేరకు సరఫరా అవుతోందన్నారు. ప్రైవేటు దుకాణాల్లోనూ యూరియా సరఫరా అవుతోందని రైతులు ఆందోళన చెందకుండా సంయమనం పాటించి కావలసిన యూరియా మాత్రమే తీసుకోవాలని తెలిపారు. అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అధికారి శివకుమార్, స్థానిక వ్యవసాయ అధికారిణి హేమలత, గ్రోమోర్ ఎరువుల పంపిణీ దుకాణాలను పరిశీలించారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి

ప్రజాశక్తి-పెద్దపంజాణి: ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్ల సానుకూలంగా స్పందించి ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూ మండలాధ్యక్షుడు బాబు రెడ్డి కోరారు. గురువారం మండల ప్రాథమిక పాఠశాలలో ఎస్టీయూ మండల శాఖ కార్యవర్గ సమావేశం మండలాధ్యక్షుడు బాబు రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర నాయకులు వై. వాసన్న, అంజాద్ అలీ ఖాన్, మండల నాయకులు శివ ప్రకాష్ బాబు పాల్గొన్నారు.

వైసిపి 'రచ్చబండ'

ప్రజాశక్తి - రొంపిచర్ల: పులిచెర్ల మండలంలోని దేవళంపేట, రాయలవారిపల్లి, కమ్మపల్లి గ్రామాలలో బుధవారం రచ్చబండ ను వైసిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం పార్టీ ఆధ్వర్యంలో గ్రామ కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సురేంద్ర నాథ్ రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెడికల్ క్యాంప్

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు ఉన్నత పాఠశాల (ఉర్దూ)లో ప్రతిభావంతులైన పిల్లలకు ఎవెల్ఐఎంసివో డాక్టర్ల సహకారంతో సమగ్ర శిక్షా చిత్తూరు వారు మెడికల్ అసెస్‌మెంట్ క్యాంప్ గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా చిత్తూరు ఏపీసి మద్దిపట్ల వెంకటరమణ అర్హులైన ప్రత్యేక ప్రతిభావంతులైన పిల్లలందరికీ ప్రభుత్వం అందించే సదుపాయాలు అందిస్తామన్నారు. మెడికల్ క్యాంపు కి హాజరైన వారందరూ అలింకో డాక్టర్ల సహకారంతో వైద్య నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. ఈ క్యాంపులో 90 మంది పిల్లలు 90 మంది పేరెంట్స్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పలమనేరు ఎంఈఓ 2 బాల సుందరం, సహిత విద్య సమన్వయకర్త జగ్గు మధు , ప్రధానోపాధ్యాయులు షాబ్జి , పలమనేరు నియోజకవర్గం లోని 5 మండలాల స్పెషల్ ఎడ్యుకేటర్లు పాల్గొన్నారుజ

టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీలకు ప్రెసిడెంట్ల నియామకం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వివిధ స్థానిక ఆలయాలకు, టీటీడీ అడ్వైజరీ ప్రెసిడెంట్లను ప్రకటించింది. తిరుమల తిరుపతి దేవస్థానంకి సంబంధించి ఇతర రాష్ట్రాల నుంచి టీటీడీ అడ్వైజరీ కమిటీ ప్రెసిడెంట్లను ప్రకటించింది. వారిలో హైదరాబాద్ జూబ్లీహిల్స్‌కి చెందిన ఏ.వి.రెడ్డిని లోకల్ అడ్వైజరీ కమిటీ ప్రెసిడెంట్‌గా నియమించింది. అదే ప్రాంతం హిమాయత్ నగర్ చెందిన నేమూరి శంకర్ గౌడ్, కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన వీరాంజనేయులు, ఢిల్లీ చెందిన ఎడుగుండ్ల సుమంత్ రెడ్డి, ముంబైకి చెందిన గౌతమ్ సింగానియా, విశాఖపట్నం సంబంధించి వెంకట పట్టాభిరామ్ చోడేలను అడ్వైజరీ కమిటీ చైర్మన్లుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

నియామక ఉత్తర్వులు ఇవ్వాలి

వైఎస్ఆర్‌టిఎఫ్ డిమాండు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: మెగా డీఎస్సీ 2025 ద్వారా ఎంపికైన అభ్యర్థులకు కోర్టు తీర్పుకు లోబడి షరతులతో తక్షణమే నియామక ఉత్తర్వులు ఇవ్వాలని వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ డిమాండ్ చేశారు. పారదర్శకంగా డీఎస్సీ అభ్యర్థులను ఎంపిక చేశామని చెబుతున్న కూటమి ప్రభుత్వం ప్రమాణ పత్రాలు, నియామక పత్రాలు అంటూ కాలయాపన చేసి ఎంపికైన వారికి పోస్టింగులు ఇవ్వడంలో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. డీఎస్సీ నిబంధనలు ఎన్నడూ లేని విధంగా సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా అధికారులు నిర్ణయాలు తీసుకోవడం వల్ల అభ్యర్థులు కోర్టును ఆశ్రయించ చాల్సిన దుస్థితి ఏర్పడిం దన్నారు. అవసరమైన పాఠశాలకు ఖాళీలను ప్రకటించి వెంటనే పోస్టింగులు ఇవ్వాలని కోరారు. దసరా సెలవుల్లో వారికి మెరుగైన వసతులతో నాణ్యమైన శిక్షణ ఇవ్వాలని డిమాండు చేశారు.

నిరుద్యోగుల నైపుణ్యాలను గుర్తించండి

ప్రజాశక్తి-పెద్దపంజాణి: కౌశలం పథకం ద్వారా వర్క్ ఫ్రం హోం నిరుద్యోగులు వారి విద్యార్హతలు తెలుపుతూ వారు ఏఏ పనులపై ఆసక్తి కలిగి ఉన్నారో సర్వే ద్వారా ఆన్‌లైనులో నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని సచివాలయ ఉద్యోగులకు ఎంపీడీవో బాలాజీ సూచించారు. గురువారం రాయలపేట సచివాలయాన్ని సందర్శించి పంచాయతీ పరిధిలో ఎంతమంది నిరుద్యోగులు ఉన్నారో స్థానిక అధికారులను అడిగారు. ఈ సర్వేను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రెడ్డి శేఖర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పెద్ద ఉప్పరపల్లి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమలలో ఈనెల 16వ తేదీ మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన స్కూల్ గేమ్ ఫెడరేషన్ మండల స్థాయి ఆటల పోటీలలో పెద్ద ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పలు రకాల పోటీలలో ప్రతిభ కనబరిచి పాఠశాలకు పేరు ప్రతిష్టలు తీసుకు వచ్చినట్టు ప్రధానోపాధ్యాయురాలు లోకేశ్వరమ్మ తెలిపారు. బాలికల రన్నింగ్ రేస్ విభాగంలో 100, 200, 300, 400, 600 మీటర్ల పరుగు పందెంలో, షార్ట్‌లో, అండర్ 14 గర్ల్స్, బాయ్స్ కబడ్డీ పోటీలలో, అండర్ 17 గర్ల్స్ కబడ్డీ, అండర్ 14, 17 వాలీబాల్‌లలో వివిధ స్థానాలలో విజయం సాధించారన్నారు.

పాఠశాలకు కుర్చీల వితరణ

ప్రజాశక్తి-విజయపురం: స్థానిక మండలంలోని శ్రీహరిపురం ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు గురువారం విశ్రాంత ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యంరాజు, విశ్రాంత ఎంపీడీవో సుబ్రహ్మణ్యంరాజు కుర్చీలు, స్టూల్స్, వితరణగా ప్రధానోపాధ్యాయులు వెంకమ రాజుకు అందించారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తోందని తల్లి దండ్రులు పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సుబ్రహ్మణ్యం రాజు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు సూరలక్ష్మి, సురేష్, గ్రామస్తులు సురేష్, గజేంద్ర, నరేష్, జయరామరాజు, ధనశేఖర్, సుజాత, గంగోత్రి, వినీత పాల్గొన్నారు.

'నమస్తే' కార్యక్రమం ప్రారంభం

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : పురపాలక పరిధిలో వ్యర్థాలను సేకరించేవారి భద్రతకోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నమస్తే' (నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకోసిస్టమ్) ను గురువారం మున్సిపల్ కమిషనర్ కేవీ కృష్ణారెడ్డి ప్రారంభించారు. దీనిపై ప్రజలకు అవగాహన ఏర్పరిచే విధంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్క్రాప్ షాపుల యజమానులకు, డంప్ యార్డ్ యందు, రోడ్డు ప్రక్కన వుండే ప్లాస్టిక్ బాటిళ్లు, పాత దుస్తులు లాంటి వ్యర్థాలను ఏరుకుని జీవనం సాగించే వారు నగరి పురపాలక సంఘ కార్యాలయం నందుగానీ, సచివాలయాలలో గానీ వివరాలు నమోదు చేసుకో వాలన్నారు. ఇందు వల్ల వారికి ఆరోగ్య భద్రత, ప్రభుత్వం వల్ల కలిగే అన్ని ప్రయోజనాలు చేకూరుస్తామన్నారు. వారికి గుర్తింపు కార్డు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కేజీ పురుషోత్తం, పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీలు, వేస్ట్‌పికర్స్ పాల్గొన్నారు.

సర్వేలను వేగవంతం చేయండి: డీఎల్‌డిఓ

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలను వేగవంతం చేయాలని డియల్‌డిఓ రామచంద్ర సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీల వారీగా జరుగుతున్న సర్వేలపై పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా డియల్‌డిఓ ను మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్ రెడ్డి, పరిపాలనాధికారి ఆనందబాబు, డిప్యూటీ ఎంపీడీవో నాగార్జున రెడ్డి పాల్గొన్నారు.

తాండవ కృష్ణపై టిటిడి విజిలెన్స్ కమిటీ విచారణ చేయాలి

ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ డిమాండ్

ప్రజాశక్తి -పలమనేరు: అంతర్జాతీయ ఖ్యాతి ఉన్న తిరుపతి లోని ఎస్వీ యూనివర్సిటీలో ఒకే వ్యక్తికి నాలుగు పోస్టులు నిర్వహించడం ఆశ్చర్యంగా ఉందని ఒక ఎన్ఎంఆర్‌గా చేరిన తాండవ కృష్ణ అనే అతను ప్రస్తుతం సివిల్ ఏఈ, డిఈ,ఈఈ పోస్టులు నిర్వహించటంపై టిడిడి విజిలెన్స్ కమిటీ విచారించాలని పలమనేరు ఎస్ సి, ఎస్ టి మానిటరింగ్ కమిటీ సభ్యులు శివాడి గోవిందయ్య, ఎస్వీ యూనివర్సిటీ ఎదురుగా అన్ని ఉద్యోగ సంఘాలు, దళిత ప్రజా సంఘాలతో నిరసన వ్యక్తం చేస్తామని నాయకులు హెచ్చరించారు.

ఎస్‌టి కాలనీల్లో అధికారుల పర్యటన

ప్రజాశక్తి-పెద్దపంజాణి: కోగిలేరు, నాగిరెడ్డిపల్లి పంచాయతీ కడపల్లి ఎస్‌టి కాలనీల్లో మండల స్థాయి అధికారులు గురువారం పర్యటించారు. ఉపాధి హామీ ద్వారా జాబ్ కార్డులు పొంది ఉపాధిని సద్వినియోగం చేసుకోవాలని గిరిజనులకు ఎంపీడీవో బాలాజీ, ఉపాధి హామీ ఏపిఓ మురుగేషన్ సూచించారు. వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకొని వినియోగించుకోవాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం వల్ల అనారోగ్యాల బారిన పడకుండా ఉంటారని ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ హేమలత తెలిపారు. గిరిజన ఆవాస ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కలెక్టర్, జిల్లా అధికారులు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులందరూ తప్పనిసరిగా బడికి వెళ్లాలని, బాల్యవివాహాలు నిరోధించాలని, ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని గిరిజనులకు అధికారులు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, నాయకులు మురహరి రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ హేమలత, ఉపాధి హామీ ఎపిఓ మురుగేషన్, ఎంసిఓ సుధాకర్, వీఆర్వో బాలాజీ, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు సుబ్రహ్మణ్యం రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, భూపతి పాల్గొన్నారు.


ఎస్‌టి కాలనీల్లో పర్యటిస్తున్న అధికారులు

వీఆర్వోలతో సమీక్షా సమావేశం


భూ సమస్యలపై సమీక్షిస్తున్న ఆర్‌డివో భవాని

ప్రజాశక్తి- సోమల: ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఇచ్చే అర్జీలను పూర్తి స్థాయిలో పరిశీలించి భూ సమస్యలు ఇంటి పట్టాలు గ్రామ కంఠం తదితర అంశాలలో విచారణ పూర్తి చేసి సరైన వివరాలు నమోదు చేసి సమస్యలు పరిష్కరించాలని పలమనేరు ఆర్‌డీవో భవాని అన్నారు. గురువారం ఆమె తహశీల్దార్ కార్యాలయాన్ని మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ముఖ్యంగా కులధ్రువీకరణ సర్వేను వేగవంతం చేయాలని సమస్యలుంటే పై అధికారుల ద్వారా వివరణ తెలుసుకొని పరిష్కరించుకోవాలని, మ్యుటేషన్ కోసం కొత్త ఆప్షన్లను ఉపయోగించి తద్వారా రైతుల సమస్యలు పరిష్కరించాలని మారుతున్న ఆధునిక సమాజంతో పాటు వీఆర్వోలు కూడా కంప్యూటర్‌పై అవగాహన కలిగి పనులు వేగవంతంగా చేసేందుకు ప్రయత్నించాలన్నారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ రీ సర్వే మండలంలోని 11 గ్రామాలలో మూడవ ఫేస్ డిసెంబర్ లోపు పూర్తి చేయాలని జనవరి నుండి జూన్ మధ్య నాలుగవ ఫేస్ రీసర్వే కోసం నివేదికలను సిద్ధం చేసుకుని ఉండాలని చెరువులు, వంకలు, వాగులు ప్రభుత్వ స్థలాలు గ్రామ కంటాలను గుర్తించి రీ సర్వేలో నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దారు మధుసూదన్, ఆర్ఐ కుత్బుతుల్లా, వీఆర్వోలు పాల్గొన్నారు.

మా పొలానికి దారి కల్పించండి

రైతుల అభ్యర్థన


మండల రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- కార్వేటినగరం : కార్వేటినగరం మండలం పరిధిలోని లక్ష్మీపురం, కొల్లగుంట గ్రామపంచాయతీ సంబంధించిన బొట్టు వారి పల్లి లెక్క దాఖలాలో సర్వేనెంబర్ 284/2లో మూడు ఎకరాల 10 సెంట్లు విస్తీర్ణంలో గుంట పోరంబోకు భూమి వుంది. అందులో కొంత భాగం లక్ష్మీపురం గ్రామస్తులు శ్మశానంగా వాడుకుంటున్నారు. సదరు కుంట పోరంబోకులో ఉత్తర భాగం రైతులు అనాదిగా రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం కొంతమంది గ్రామస్తులు దారికి అడ్డుపడగా తాము వెళ్లి కలెక్టర్, ఆర్డిఓ, తహశీల్దారుని సంప్రదించి అర్జీ ఇచ్చారు. అనంతరం స్పందించిన ఎమ్మార్వో రైతులు రాకపోకలు సాగించేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని లిఖితపూర్వకంగా ఎండార్సుమెంట్ ఇచ్చారు. తమ అభ్యర్థన దారికి మార్కు చేసి ఇచ్చారని, గతంలోనే అనేకమార్లు పంచాయతీ రాజ్ ద్వారా శ్మశాన రోడ్డు కోసం అధికారులు ఎన్నిసార్లు నచ్చజెప్పినా దురుద్దేశంతో కొంతమంది గ్రామస్తులు అభ్యంతరం చెప్పి రైతులు వారి పొలాలకు పోకుండా అడ్డుపడుతున్నారన్నారు. దారి వల్ల గ్రామస్తులకు ఎలాంటి నష్టం లేదని గ్రామస్తులు దారి అడ్డంగా గుంతలు తవ్వుతున్నారన్నారు. పంచాయతీ వారు వేసిన దారిని జెసిబి ద్వారా తవ్వి దారిని లేకుండా చేస్తున్నారని, తమ పట్టా భూమిలలో రాతికూసాలు నాటుతున్నారన్నారు. రెవెన్యూ అధికారులు, పోలీసులు వచ్చినా వారిపై కూడా దౌర్జన్యం చేస్తున్నారన్నారు. ఈ కారణంగా రైతులు పంటలు వేసుకోక చేతికి వచ్చిన పంటలు అరువడి చేసుకోక ఎన్నో లక్షలు నష్టపోయారన్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఉన్నదారిని కల్పించాలని కోరుతున్నామన్నారు. తమకు వేరే దారి లేక చాలా ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

బాధిత బాలుడికి రూ.లక్ష ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న ఎస్‌డిపిఐ నేతలు

ప్రజాశక్తి -పుంగనూరు: విద్యుత్ షాక్ కు గురి అయిన బాలునికి వైద్య ఖర్చుల నిమిత్తం లక్ష రూపాయలు విరాళాల ద్వారా సేకరించి అందిస్తున్నట్లు ఎస్‌డిపి ఐ నేతలు సిద్దిక్, ఆసిఫ్ లు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఈ ఆర్థిక సహాయాన్ని వారి తల్లిదండ్రులకు అందించారు. 15 రోజులు క్రితం 8 సంవత్సరాల ఒక చిన్నారికి కరెంటు షాక్ తగలడంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న అతనిని తిరుపతి రుయా హాస్పిటల్ కి తరలించారు. డాక్టర్లు వెంటనే ఆపరేషన్ చేయాలన్నారు. ఆపరేషన్ కు 5 లక్షలు ఖర్చు అవుతాయని తెలిపారు. పేద కుటుంబం నుంచి వచ్చిన ఈ చిన్నారి తల్లిదండ్రులు ఏం చేయాలో అర్థం కాని సమయంలో ఎస్‌డిపిఐ వారిని కలిసి తమ సమస్యను చెప్పుకున్నారు. దీనిపై స్పందించిన సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా తరపునుండి సోషల్ మీడియాలో ఒక స్కానర్ పెట్టి ఆ చిన్నారి ఆపరేషన్ కోసం విరాళాలు సేకరించమన్నారు. లక్ష రూపాయలు విరాళాలు రావడం జరిగిందన్నారు.ఈ విరాళాలకు సహకరించిన వారికి పుంగనూరు పట్టణానికి చెందిన ప్రజలు,అంజుమన్ కమిటీ,సున్ని అంజుమన్ కమిటీ కి , స్కానర్ ద్వారా విరాళాలుఇచ్చిన ప్రతి ఒక్కరికి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా చికిత్స కు 4లక్షలు అవసరం ఉంది. ఎవరైనా దాతలు ఉంటే వెంటనే ముందుకు వచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కార్యదర్శి ఆసిఫ్, షామీర్ చాంద్ బాషా, విఅతిక్ బాష, నౌషాద్, భాషా, మహమ్మద్ అలీ, పి.ఖాదర్ భాష,చోటు పాల్గొన్నారు.

టిడిపి కుప్పం అర్బన్ అధ్యక్షుడిగా వెంకటేష్..

రూరల్ అధ్యక్షుడిగా రాజగోపాల్




ప్రజాశక్తి -కుప్పం: కుప్పం మున్సిపాల్టీకి సంబంధించి అర్బన్ అధ్యక్షుడిగా కాణిపాకం ఆలయ మాజీ డైరెక్టర్, టిడిపి సీనియర్ నేత వన్నెకుల క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన కాణిపాకం వెంకటేష్ కు అవకాశం కల్పించారు. ఇక కుప్పం రూరల్ మండల పార్టీ అధ్యక్షుడిగా రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ రాజగోపాల్ ను నియమించారు. వైసిపి అధికారంలో ఉన్న సమయంలో కుప్పం టిడిపి ఎంపీపీ అభ్యర్థిగా రాజగోపాల్ ను ప్రకటించారు. ఈ నేపథ్యంలో కురబ సామాజిక వర్గానికి చెందిన రాజగోపాల్ కు రూరల్ మండల పార్టీ అధ్యక్షుడిగా అవకాశం కల్పించారు.

నిబంధనలు లేకుంటే చర్యలు: కమిషనర్

ప్రజాశక్తి-పలమనేరు: మున్సిపాల్టీ అప్రూవ్ ప్రకారం ఇళ్లు నిర్మించాలని లేకుంటే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ ఎన్‌వి రమణా రెడ్డి హెచ్చరించారు. పలమనేరు పురపాలక సంఘ పరిధిలో జవిలి వీధి, మదనపల్లె రోడ్, బజారు వీది, కాకాతోపు, గాంధీ నగర్ ప్రాంతాలలోని భవన నిర్మాణాలను మున్సిపల్ కమిషనర్ టౌన్ ప్లానింగ్ సిబ్బందితో కలిసి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్లాన్ ప్రకారమే 'ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని సదరు భవన నిర్మాణ యజమానులను ఆదేశించారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము అనధికార లే–అవుట్ ల క్రమబద్ధీకరణ పథకం 2020 ద్వారా కట్ అఫ్ డేట్ 2025, జూన్ 30వ తేదీ నాటికి నాటికి రిజిష్టర్ అయిన అనధికార లే–అవుట్ లు, ప్లాట్లును క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహిళల ఆరోగ్యమే లక్ష్యం

ప్రజాశక్తి - యాదమరి: మండలంలోని కోనపల్లిలో స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్‌ను ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్ గురువారం తనిఖీ చేశారు. యాదమరి వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ మాట్లాడుతూ కుటుంబంలో మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో వుంచుకుని ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో యునాని వైద్యాధికారిణి డాక్టర్ తులసి, ఏఎన్ఎం, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

ఐరాల: కాణిపాకం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఎం పల్లి సచివాలయం జంగాలపల్లిలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌ను డిఎంహెచ్ఓ డాక్టర్ సుధారాణి గురువారం తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్ హెచ్ ఎం కోఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్, కాణిపాకం వైద్యాధి కారి డాక్టర్ ఏ స్వాతి సింధూర, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

సోమల:(సదుం): మహిళల ఆరోగ్యం సంరక్షణ కోసమే స్వస్థ్ నారి సశక్త్ పరివార్ వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు సదుం వైద్యాధికారులు చరణ్, గాయత్రి తెలిపారు. సదుం1 సచివాలయం వద్ద వైద్య శిబిరాన్ని నిర్వహించి పలువురు మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది నీలకంఠ జానకి, శికామణి, హేమలత, సరస్వతి రషీద్, దీప, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సోమల మండలం 81 చిన్న ఉప్పరపల్లి సచివాలయం వద్ద సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు జయసింహ ప్రదీప్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ అమర్నాథ్, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


తవణంపల్లిలో

తవణంపల్లి: తవణంపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గాజుల పల్లె లో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి వెంకట ప్రసాద్, డాక్టర్ టిఎస్‌మోహన వేలు, డాక్టర్ టి , ప్రియాంక కమ్యూనిటీ హెల్త్ అధికారి జ్ఞాన శేఖర్ , ఆరోగ్య పర్యవేక్షకులు, ఆరోగ్య కార్య కర్తలు పాల్గొన్నారు.

విజయపురం (నగరి) : మండలంలోని బుగ్గ అగ్రహారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'స్వస్థనారీ సశక్తి పరివార్ అభియాన్' ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. మండల వైద్యాధికారులు, వైద్య నిపుణులు ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టరు మోహనరూప, నగరి ఏరియా హాస్పిటల్ వైద్యనిపుణులు డా.జెరీనా, వైద్యులు కార్తికేయన్, లోకేష్, శ్రీనాథ్, కీర్తిప్రియ, సర్పంచ్ రవి, ఎంపీటీసీ జ్యోతి, ఎంపీహెచ్‌ఈవో జనార్ధన్, సూపర్‌వైజర్లు బాబు, సుశీలమ్మ, శంకర్ రాజు, సుబ్రహ్మణ్యం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎం లు, ఆశాలు పాల్గొన్నారు.


ఎస్ఆర్ పురంలో

ఎస్ఆర్ పురం : స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఆరిమాకులపల్లి వైద్యాధికారి డాక్టర్ బాలాజీ చరణ్ స్థానిక సర్పంచ్ డివి డిల్లెయ్య, మాజీ సర్పంచ్ విజయబాబు ప్రారంభించారు. కొటార్లపల్లి ఆరోగ్య కేంద్రంలో ఆరిమాకులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ బాలాజీ చరణ్ స్పెషలిస్ట్ డాక్టర్లతో మహిళలలు, పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయబాబు, సూరి రెడ్డి, కోటిరెడ్డి బాబు రిటైర్డ్ టీచర్ చంద్ర శేఖర్ రెడ్డి, ఏంఎల్‌హెచ్‌పి, ఏఎన్ఎం ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కుప్పం: కుప్పం మండలం ఎన్ కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కొత్త ఇండ్లు గ్రామంలో స్వస్త్ నారీ సశక్త్ పరివార అభియాన్ పట్ల అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టరు సుభాష్ రాజా, వైద్యాధికారిణి డాక్టరు సుధారాణి, ముత్తు కుమార్ అవగాహన కల్పించారు.

ఫలించిన కార్యకర్తల నిరీక్షణ


ఉదయ్ కుమార్

ప్రజాశక్తి- శాంతిపురం: టిడిపి మండల అధ్యక్షులుగా నందిగం ఉదయ్ కుమార్ ఎన్నికయ్యారు. రాష్ట్ర టిడిపి కార్యాలయం, అధిష్టానం నుండి గురువారం అధ్యక్షులను ఎన్ను కున్నారు. ఉదయ్ కుమార్‌ను అధ్యక్షుడుగా ఎన్నుకోవడంతో రెండున్నర నిరీక్షణకు తెరపడింది. గతంలో టిడిపి అధికా రంలో ఉన్న సమయంలో ఎనమాకులపల్లి ఎంపీటీసీగా అఖండ మెజారిటీతో గెలుపొందిన ఉదయ్ కుమార్ మండల పరిషత్ ఉపాధ్యక్షుడిగా ఐదు సంవత్సరాలు పాటు కొనసాగారు. ఉదయ్ కుమార్ పార్టీ కోసం చేసిన సేవలను గుర్తించి అధిష్టానం బాధ్యతాయుతమైన ఈ పదవిని కట్టబెట్ట డంతో మరింత అభివృద్ధి జరుగుతుందని ప్రజలు కార్యకర్తలు విశ్వసిస్తున్నారు. ఈ సందర్భంగా ఉదయ్ కుమార్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో ఈ గ్రూప్ ద్వారా బాధ్యతను అప్పగించిన అధిష్టానం ముఖ్య మంత్రి చంద్రబాబును, మంత్రి లోకేష్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షు లు పిఎస్ మునిరత్నం ఇతర పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. తనకిచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పార్టీని మరింత బలోపేతం చేసి తన శక్తి వంచన లేకుండా పార్టీకి ప్రజలకి సేవ చేస్తానన్నారు.

క్రైం న్యూస్

ఆటోఢీ ..ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి -పుంగనూరు: ద్విచక్రవాహనంలో వస్తున్న ముగ్గురు యువకులను ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో ముగ్గురు యువకులు గాయపడిన సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు మండలంలోని ఏడూరు గ్రామానికి చెందిన ఆకాష్ (17), ప్రసాద్ (18) శ్రీనాథ్(17) కలిసి పుంగనూరుకు ద్విచక్రవాహనంలో వస్తుండగా భరిణేపల్లి వద్ద ఎదురుగా అతివేగంగా వస్తున్న ఆటో ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయ పడ్డారు. స్థానికులు గమనించి బాధితులను స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకి తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం

ప్రజాశక్తి- పాలసముద్రం: పాలసముద్రం మండలం బాలకృష్ణ పురానికి చెందిన సురేంద్ర భార్య పూర్ణిమ (26) బుధవారం నుండి కనిపించడం లేదని ఆమె తండ్రి సురేష్ గురువారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈమెకు నాలుగు సంవత్సరాల క్రితం అదే గ్రామానికి చెందిన సురేంద్రతో వివాహం అయ్యిందని వీరికి చిన్న చిన్న మనస్పర్థలు వున్న కారణంగా ఇంట్లో నుంచి వెళ్లిపోయిందని కుటుంబ సభ్యులు తెలిపారు. తండ్రి సురేంద్ర ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్ఐ చిన్న రెడ్డప్ప కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఓజోన్ పొరను పరిరక్షించాలి

ప్రజాశక్తి -వెదురుకుప్పం : ఓజోన్ పొరను పరిరక్షించాలని రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టరు బి అన్నపూర్ణ శారద అధ్యక్షత వహించారు. వాతావరణంలోని స్ట్రాటోస్పియర్‌లో ఉన్న ఓజోన్ పొర సూర్యకాంతిలోని అతి నీల లోహిత కిరణాలను రక్షించుకోవడం ద్వారా భూమిపై ఉన్న జీవరాశులను పరిరక్షించుకోచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ లక్ష్మీ ప్రసన్న లత, బోటనీ విభాగం ఆధ్వర్యంలో ఓజోన్ పొర క్షీణతపై ఆన్‌లైన్ క్విజ్ నిర్వహించి విజేతలైన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఐ క్యూ ఏసి కో ఆర్డినేట ర్ డాక్టరు పి వెంకటేశు, అధ్యాపకులు, విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు.

పురాణ ఇతిహాసాలపై అవగాహన

ప్రజాశక్తి -పాలసముద్రం : మండలం లోని బలిజ కండ్రికలోని ఎస్ ఆర్ కండ్రిగ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పురాణ ఇతిహాసాలపై గురువారం అవగాహన, మక్కువ పెంపునకు మేడ సాని మోహన్ భాగవతం పై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమం తెలుగుపై మక్కువ కలిగి ఉన్న వివిధ భాషా ప్రావీణ్యులు విశ్రాంత ఉపాధ్యాయులు అవధాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులకు అవధాన కార్యక్రమం పై మక్కువ పెరగడమే కాకుండా జ్ఞాపకశక్తి, ధారణ పద్ధతులు మెరుగైన విద్యార్థులు చురుకుగా తయారవుతారు. పురాణ ఇతిహాసల పై ఆసక్తిని పెంచే విధంగా ఈ కార్యక్రమం విజయవంతంగా జరగడం విశేషం. భారతదేశ సంస్కృతి సాంప్రదాయాల విషయాలలో జ్ఞానాన్ని సంపాదించి భావితరాలకు బాసటగా విద్యార్థులు తయారు కావడం లో ఇదొక ప్రక్రియ అని, నైతిక విలువలతో కూడిన విద్య అందించడం ఎంతో అవసరమని పలువురు ప్రసంగించారు. ఈ కార్యక్రమం లో పలువురు అతిథులు పాల్గొన్నారు .

టిడిపి మండల కన్వీనర్‌గా వెంకటరమణ


ముఖ్యమంత్రితో వెంకటరమణ (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి- రామకుప్పం: రామకుప్పం మండల టిడిపి అధ్యక్షుడిగా ఎన్ వెంకటరమణను గురువారం ఆ పార్టీ అధిష్టానం నియమించింది. గత 15 రోజుల క్రితం మండలంలోని అనిగానూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రామ్మూర్తి, కెంప సముద్రం గ్రామానికి చెందిన ఎన్. వెంకటరమణ ల ఎంపికలపై ఐవీఎస్ ద్వారా కార్యకర్తల అభిప్రాయాల మేరకు ఫోన్ కాల్స్ వచ్చాయి. నేతలు ,కార్యకర్తలు అభిప్రాయం మేరకు వెంకటరమణకు ఎక్కువ శాతం అతను మండల అధ్యక్షుడుకి అర్హుడని తెలిపింది. దీంతో గురువారం పార్టీ అధికారి కంగా ఎన్ వెంకటరమణ పేరును ఖరారు చేసింది. నియోజకవర్గ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా, మణింద్రం యూనిట్ ఇన్చార్జిగా వెంకటరమణ పార్టీ లో చురుగ్గా కొనసాగాడు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, ఉడ చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, మండల నాయకులుకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు: డీఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సామాజిక మాధ్యమాలలో నిజనిజాలు తెలుసుకోకుండా శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన, వ్యక్తిగత విమర్శలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు డీఎస్పీ టి.సాయినాథ్. గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నాయకులు, అధికారులు ఎవరైనా కొత్తగా పదవీ బాధ్యతలు చేపడితే వారి వద్దకు అనేక మంది ప్రజలు, అభిమానులు, పార్టీ కార్యకర్తలు, సామాజిక వర్గాలకు చెందిన వారు వివిధ అవసరాల కోసం వచ్చి కలుస్తూ ఉంటారని, ఈ సందర్భంగా చాలా ఫోటోలు కూడా దిగుతారని, ఈ సహజమైన విషయాన్ని వేరే కోణంలో చూపించి, ఆ ఫోటోలో ఉన్న వ్యక్తి ఏదైనా తప్పు చేసినప్పుడు ఆ నాయకుడికి కూడా ప్రమేయం ఉందని అర్థం వచ్చేలా తప్పుడు ప్రచారం చేయడం అసత్యం మాత్రమే కాకుండా బాధ్యతారహిత చర్య కూడా అన్నారు.